
# ఆత్మశాంతి



**టి. శ్రీవల్లి రాధిక**

"ఏమే! ఆ రెండో ధోవతీ, ఉత్తరీయం కూడా ఉతికించావా!" వెంకట్రామయ్య ప్రశ్న విని నవ్వుకుంది వరలక్ష్మి.

భర్త సంబరాన్ని రెండురోజులుగా గమనిస్తూనే వుందామె. అప్పటి వరకూ నీరసంగా వున్న మనిషికి ఈడుపుగల్లు ప్రయాణం అనేసరికి ఎంత హుషారొచ్చిందో!

అవునుమరి, ఆయనకి ఆ ఊరితో వున్న అనుబంధం అలాంటిది. వరలక్ష్మి కాపురానికి వచ్చేనాటికి ఆయనకి ఇరవై ఏళ్ళు. అంతకుముందు ఎప్పటినుంచో ఆ ఊళ్ళో వుంటున్నారు వాళ్ళు.

ఆయన బాల్యమూ... యవ్వనమూ... వృద్ధాప్యమూ... జీవితంలోని ప్రతీ అనుభవమూ అక్కడే గడిచింది. ఎనభై ఏళ్ళు వచ్చేవరకూ అదే ఊరు, అదే ఇల్లు.

పిల్లలందరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు సంపాదించుకుని వచ్చేసినా, వాళ్ళుమాత్రం ఆ ఊరు వదిలిపెట్టలేదు. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ నెట్టుకొచ్చారు. నాలుగేళ్ళ క్రితం...

ఇంక లాభం లేదనుకున్నాక అప్పుడు ఇల్లు అమ్మేశారు. వచ్చిన డబ్బులు పిల్లలందరికీ సమానంగా పంచి, పెద్దకొడుకు దగ్గరికి వచ్చేశారు.

ఇక్కడ బాగానే వుంది. కోడలు అన్నం వండిపెడుతుంది. హాల్లో టి.వి. మ్రోగుతూ వుంటుంది. మనవళ్ళూ... ముని మనవళ్ళూ సందడి చేస్తూంటారు.

కానీ ఇవేవీ ఆయనకి పూర్తి సంతృప్తినివ్వలేదు.

ఘడియకీ, క్షణానికీ "ఏవండోయ్ వెంకట్రామయ్యగారూ! ఏం చేస్తున్నారు" అంటూ వీధిలో నుంచి వినబడే పలకరింపులూ, కాలు బయట పెట్టడం ఆలస్యం "నమస్కారమండీ" అంటూ ఎదురొచ్చే పరిచయస్తులూ,

రచ్చబండదాకా నడిచి నడుం ఆనిస్తే... మందగమనాలతో చుట్టుముట్టే వృద్ధనేస్తాలూ... ఇక్కడ అలాంటివి ఏమీ లేవు.

ఇక్కడ వెంకట్రామయ్య అనేవాడు ఎవరికి తెలుసు! ఈ మూలగదిలో మంచంమీద పడుకున్న ముసలాయన గురించి ప్రక్కింటి వాళ్ళకైనా సరీగా తెలియదు.

అలాగే మూడేళ్ళు గడిపాడు. పుట్టి పెరిగిన పల్లెటూరిమీద ఎంత మమకారం వున్నా, "నేనేగా ఆ ఊరితో సంబంధం తెంపుకుని వచ్చేశాను" అనుకుంటూ సమాధానపడ్డాడు.

కానీ గత సంవత్సరం ఆరోగ్యం మరీ దెబ్బతింది. ఇంకెన్నాళ్ళో బ్రతకనని ఆయనకి అర్థమయింది. దీనితోపాటు ఒక్కసారి ఊరు చూసి రావాలన్న కోరిక ఉధృతమయింది.

వరలక్ష్మికి తెలుసు. కొడుకులకీ, మనవళ్ళకీ కూడా తెలుసు. కానీ ఎనభైనాలుగేళ్ళ ఆ ముసలాయన్ని... ఇప్పుడు అక్కడికి ఏమని తీసుకెళ్తారు! "ఛార్జీలూ, డబ్బులూ అవి కాదమ్మా. అసలు ఆయన ప్రయాణమన్నా చేసే స్థితిలో లేడుకదా!" అన్నాడు పెద్ద కొడుకు రాఘవ.

"తీరా అక్కడిదాకా వెళ్ళినా హైరానా మిగుల్తుంది తప్ప ఈయన ఊహించుకున్నంత ఏముంటుందని! ఆ పల్లెటూర్లో ఎవరింటికని వెళ్తాం! ఏం చేస్తాం!"

అతను చెప్పిందీ నిజమే. అంత పని కట్టుకుని ఆయన్ని అక్కడికి తీసుకువెళ్ళే అవసరం కానీ... అవకాశం కానీ ఎవరికీ లేవు. ఆయన కలవరిస్తున్నాడు నిజమే. కానీ ఆచరణకి అది సాధ్యమయ్యే పనికాదు.

అందుకే భర్త చిన్నపిల్లాడిలా గొడవపెడుతూంటే వరలక్ష్మి ఓపికగా నచ్చచెపుతూ వచ్చింది. "...రామనాథంగారూ, కృష్ణమూర్తిగారూ కూడా

ఇప్పుడిక్కడ లేరట. శ్రీమన్నారాయణగారూ పోయిన సంవత్సరం పోయారట. ఊరు కూడా ఇప్పుడు చాలా మారిపోయిందట..." ఈ ధోరణిలో ఆవిడ చెప్పినంత సేపూ చెప్పేది.

మాట్లాడకుండా వినేవాడు వెంకట్రామయ్య. అంతా అయ్యాక, గుండెలమీద తడుముకుంటూ... పైకప్పు మీద చూపునిలిపి... "ఏమైనా ఒక్కసారి చూసి రావాలని వుందే!" అనేవాడు.

వరలక్ష్మి తలమీద తట్టుకుని, అసహాయంగా నిట్టూర్చేది.

కానీ వారంక్రితం ఒక అద్భుతం జరిగింది. దేవుడు ఆయన బాధకి కరిగాడో... ఆమె ప్రార్థన విన్నాడో కానీ...

ఆయన తమ్ముడి కొడుకు వచ్చాడు. శుభలేఖలు పట్టుకుని.

"పెదనాన్నా! మావాడి పెళ్ళి కుదిరింది. అమ్మాయిది ఈడుపుగల్లు. పధ్నాలుగో తారీఖున ముహూర్తం. వ్యాన్ మాట్లాడాను. అందరం పదమూడు రాత్రికి బయలుదేరి వెళ్ళాలి" అని చెప్పి వెళ్ళాడు.

అదిగో, ఆ మాటలు విన్నప్పటి నుంచీ వెంకట్రామయ్య సంతోషం చెప్పతరం కాదు. పెట్లోంచి తన పాత సంచీ బయటకు తీయించాడు. బట్టలన్నీ ఉతికించుకుని, అందులో సర్దించుకున్నాడు.

ఇంట్లో ఇంకా ఎవరెవరు బయలుదేరుతున్నారో వరలక్ష్మికి అర్థం కాలేదు. "కొడుకు, కోడలు అయితే తప్పకుండా వెళ్తారు. తనని చూసుకునేందుకు ఒక మనవడిని, మనవరాలిని అట్టేపెట్టి వెళ్తారేమో! పెద్ద మనవడూ, వాడి భార్యా కూడా వెళ్తున్నట్లున్నారు."

అంతా వరలక్ష్మి ఊహాగానాలే కానీ ఇదీ విషయం అంటూ ఎవరూ ఆవిడతో చెప్పలేదు. అడిగేందుకు అవకాశమూ ఇవ్వలేదు.

"కోడలూ, మనవడూ వెళ్తారు కదా! చాలు. అన్ని పనులూ అది చూసుకుంటుంది. ఆయన్ని బండిలోకి ఎక్కించడం, దింపడం వాడు చూసుకుంటాడు. తాతయ్యంటే వాడికి చాలా ప్రేమ" నిశ్చింతగా అనుకుంది వరలక్ష్మి.

"ఇంకా రెండు రోజులు." చిన్నగా నిట్టూరుస్తూ తనలో తానే లెక్కపెట్టుకుంది.

చూస్తుండగానే ఆ రెండు రోజులు కూడా గడిచిపోయాయి.

రాత్రికే ప్రయాణం

మధ్యాహ్నం భోజనాలయ్యాక చెప్పులేసుకుని బయటకు వెళ్తున్న మనవడిని దగ్గరికి పిల్చింది వరలక్ష్మి.

"ఒరే ప్రశాంతూ, తాతయ్య బట్టలన్నీ ఈ సంచీలో సర్దాను. ఆయన బాధ్యతంతా నీదే." ఆమె నవ్వుతూ చెప్తుంటే వాడు అయోమయంగా చూశాడు.

"తాతయ్యానెవరు తీస్కెళ్తున్నారిప్పుడు!" అన్నాడు.

వరలక్ష్మి బిత్తరపోయింది. "అదేమిటి!" అంది.

"తాతయ్యొస్తున్నారని నాకసలు తెలీదు" అన్నాడు.

"ఇందులో తెలిసేదేముందిరా! ఎలాగూ వ్యానే ఇంటిదాకా వస్తుందికదా! తాతయ్య కూడా వస్తారు." వరలక్ష్మి తేలికగా అంది.

"అది కాదు నాయనమ్మా! వచ్చేటపుడు నేను వ్యాన్‌లో రాను. అక్కడి నుంచి బాంబే వెళ్తాను. రిటన్‌టెస్ట్ వుంది నాకు."


ఆ మాట వినగానే కంగారుగా కోడలి దగ్గరికి నడిచింది.

"ఏమే పార్వతీ! వచ్చేటపుడు ప్రశాంత్ మీతో రాడా!"

"లేదత్తయ్యా, రావడంలేదు."

"అయ్యో!" అంది వరలక్ష్మి. "వాడొస్తే మామగారి సంగతి శ్రద్ధగా చూసుకుంటాడు కదా అనుకున్నాను. సరే కానీ ఏంచేస్తాం! రాఘవ వుంటాడుగా" తనలో తానే అనుకున్నట్లుగా అంది.

గిన్నెలు కడుగుతున్న పార్వతి ఆశ్చర్యంగా వెనక్కి తిరిగింది. "మామగారు కూడా వస్తున్నారా పెళ్ళికి!"




మరోమారు బిత్తరపోయింది వరలక్ష్మి. "అదేమిటే అలా అడుగుతున్నావు? ఈడుపుగల్లు వెళ్ళాలని మామగారు ఎన్నాళ్ళబట్టో కలవరిస్తున్నారు కదా! ప్రయాణం కష్టం అనీ, తీసుకెళ్ళే తీరిక లేదనీ వాయిదా వేశాం. ఇపుడు అక్కడిదాకా వ్యాన్ వెళ్తూంటే మామగారు రాకుండా ఎలా వుంటారు?" పార్వతి మాట్లాడలేదు. ఒక్కక్షణం మౌనం తర్వాత "మీ అబ్బాయి అనలేదు మరి" అంది.

వరలక్ష్మి గుండె వేగంగా కొట్టుకుంది. "నిజమే. అసలు రాఘవ ఏమనుకుంటున్నాడో!" సాలోచనగా వెనక్కి వచ్చింది.

నిద్రబోతున్న వెంకట్రామయ్య మొహంలో స్పష్టంగా మెరుస్తున్న ఆనందం చూస్తే ఆమె భయం మరింత ఎక్కువయింది. "ఈసారి కూడా ప్రయాణం లేదని తెలిస్తే ఇంకేమైనా వుందా!"

కొడుకు కోసం ఎదురుచూస్తూ గేటుదగ్గర చతికిలబడింది వరలక్ష్మి.

ఎన్నాళ్ళ కోరిక! ఎన్నాళ్ళ కలవరింత! మొట్టమొదట... సంక్రాంతికి ముందు... "ఎవరూ రానక్కరలేదు. నేనొక్కడినే వెళ్ళగలను." అంటూ బయలుదేరాడు వెంకట్రామయ్య.

అపుడు ఇంకొంచెం ఓపిక వుండేది. కానీ ఇంటిల్లిపాదీ భయపడ్డారు. ఎలాగోలా నచ్చచెప్పి, బ్రతిమలాడీ ప్రయాణం మాన్పించారు. మూడ్నెల్లు ఊరుకున్నాడు. శ్రీరామనవమి వస్తోందనగానే మళ్ళీ బయలుదేరాడు. "ఊరికెళ్ళి పందిళ్ళు చూడాలంటూ..."

భగీరథ ప్రయత్నంతో మళ్ళీ ఆపారు.


ఆ తర్వాత తనంతట తను వెళ్ళలేనని ఆయనకే అర్థమయింది. "ఒక్కసారి తీసుకెళ్ళండిరా!" అనే బ్రతిమలాట మొదలయింది.

ఎనిమిది నెలలు ఏ దూరపు చుట్టం ఆ వైపుగా వెళ్తున్నాడన్న వార్త విన్నా... వాళ్ళతో తానూ వెళ్తానన్న మారాము ఎక్కువయింది.

అయినా ప్రయాణం మాత్రం కుదరలేదు.

అన్నీ అయిపోయాక... ఇపుడు ఈ అవకాశం వచ్చింది. ఇది కూడా పోతే... ఇక ఆయన ఆ ఊరు వెళ్ళడం పడదు. ఆ కోరిక తీరదు.

అందుకే వరలక్ష్మి భయపడుతోంది. ఆమె ఆందోళనతో సంబంధం లేకుండా కాలం గడిచింది. ఆరింటికి రాఘవ వచ్చాడు. "ఏంటమ్మా! అంత దూరం




ఎలా తీస్కెళ్తాం, వ్యాన్‌లో అయితే మాత్రం!" అన్నాడు.

ఏడు అవగానే కోడలు భోజనం పెట్టింది. వెంకట్రామయ్య భోజనం చేసి, సంచీ ఒకసారి సరిచూసుకుని, వ్యాన్ కోసం ఎదురుచూస్తూ మంచంమీద నడుం వాల్చాడు.

భర్తకి ఎలా చెప్పాలో అర్థంకాని అయోమయంతో వరలక్ష్మి మంచం దగ్గర చతికిలబడింది.

"వాళ్ళు రాగానే లేపవే" అంటూ వెంకట్రామయ్య నిద్రలోకి జారాడు.

తొమ్మిదవుతూండగా వచ్చింది వ్యాన్.

"వెళ్ళొస్తామమ్మా. ఎల్లుండి ప్రొద్దుకి వచ్చేస్తాం." రాఘవ బయటకి నడిచాడు.

నిద్రపోతున్న భర్తని ఒకసారి పరీక్షగా చూసి వడివడిగా బయటకి వచ్చింది వరలక్ష్మి.

"మామగారు సంచీకూడా సర్దుకున్నారండీ. బాధపడతారేమో!" అంటోంది కోడలు వ్యాన్ దగ్గర.

"పోనీ తీసుకెళ్దాం నాన్నగారూ! వచ్చేడపుడు మీరు కాస్త కష్టపడాలి అంతేగా!" అంటున్నాడు మనవడు.

రాఘవ ఆలోచిస్తున్నట్లుగా నిలబడ్డాడు.

వరలక్ష్మి ఆశగా గడప దగ్గర ఆగింది.

"ఏమయింది!" వ్యాన్‌లోనుంచి చుట్టాలందరూ అడిగారు.

రాఘవ సమస్యని వివరించాడు.

"అంతదూరం తీస్కెళ్ళడం కష్టమేమోనని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"నిజమే" అందరూ ముక్తకంఠంతో అతన్ని సమర్థించారు.

"అందుకే నాన్నకి చెప్పకుండా బయల్దేరాం" రాఘవ సంజాయిషీగా అన్నాడు.

"మంచిపని చేశారు" వ్యాన్‌లో మంచి పదిగొంతులు ఒకేసారిగా వినిపించాయి. "పెద్దవాళ్ళు ఒక్కొక్కప్పుడు చాదస్తంగా వుంటారు. కష్టసుఖాలు మనమే ఆలోచించుకోవాలి."

ఆ మాటలు ఊతంగా తీసుకుని రాఘవ వ్యాన్ ఎక్కాడు. వెనకే అతని భార్యా... కొడుకూ...

వ్యాన్ కదలగానే వరలక్ష్మి లోపలికి నడిచింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి. నిద్రపోతున్న భర్తనే తదేకంగా చూస్తూ మంచం దగ్గర కూర్చుంది.

తెల్లవారుఝామున నాలుగు గంటలకి ఉలికిపడినట్లుగా లేచాడు ఆయన. "ఏమే వ్యాన్ వచ్చిందా!" కలవరిస్తున్నట్లుగా వినబడిన ప్రశ్నకి, ఒక్కొక్క అక్షరమూ కూడబలుక్కుంటూ సమాధానం చెప్పింది వరలక్ష్మి. అప్పటికి ముప్పైవేలసార్లు మననం చేసుకున్న సమాధానం...

"వచ్చింది, పిల్లలు వెళ్ళారు."

అంతే, ఆ మాటలకి వెంకట్రామయ్య స్పందన మాత్రం ఆమెకి కనబడలేదు. ఎంత కళ్ళు విప్పార్చి చూసినా, ఆ గుడ్డి వెలుతురులో ఆయన మొహంలోని భావం పట్టుబడలేదు.

ఆ తర్వాత ఆయన కూడా నిద్రపోలేదని మాత్రం అర్థమయింది.

రెండురోజుల తర్వాత వెళ్ళిన వాళ్ళు తిరిగివచ్చారు.

తర్వాత నాలుగు రోజులకి... వెంకట్రామయ్య నిద్రలోనే మరణించాడు.

చివరి వారంరోజులూ ఎవరితోనూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

◐ ◐ ◐

శవదహనం అయింది.

"కర్మకాండలు ఈదువుగల్లులో జరిపిస్తే బాగుంటుందని నా అభిప్రాయం" ఒక కూతురు తీర్మానం ప్రవేశపెట్టింది.

"ఈదువుగల్లులోనా...!"

"అవును, ఈదువుగల్లు అంటే నాన్నకి చాలా ఇష్టం" రెండో కొడుకు వత్తాసు పలికాడు.

"కరక్టే కానీ పరాయి ఊరంటే చాలా ఖర్చవుతుంది. ఇబ్బందులు కూడా చాలా వుంటాయి" అన్నాడు వెంకట్రామయ్య తమ్ముడు.

"ఖర్చు గురించి ఆలోచిస్తే ఎలా! మామగారి మనసుకు ఇష్టమైచోట జరిపిస్తే ఆయన ఆత్మకి శాంతి" రెండో కోడలి మాటలివి.

ఒక్కొక్క వాక్యమూ చెవిన పడుతూంటే వరలక్ష్మికి మతిపోతోంది. "ఆయన బ్రతికుండగా ఏమయ్యారు వీళ్ళందరూ!"

"ఇంక దేనిమీదా అంత భ్రాంతి లేదు ఆయనకి. అన్ని విషయాల్లో ఎంతో గంభీరంగా వుండే మామగారు, ఒక్క ఊరు విషయంలో మాత్రం చిన్నపిల్లాడయి పోయేవారు."

"అవునుమరి, నాన్న చిన్నప్పుడు చదువుకున్నది ఆ వూర్లోనే... సంపాదన ఆ ఊళ్ళోనే, మేమందరమూ పుట్టింది అక్కడే, మా పెళ్ళిళ్ళూ... మళ్ళీ మనవళ్ళు పుట్టడం... ఎన్ని జ్ఞాపకాలు వున్నాయనుకున్నావ్ ఆయనకు ఆ ఊరితో!"

కూతురి మాటలు వింటుంటే వరలక్ష్మి కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలాయి.

వీళ్ళు... వీళ్ళంతా వున్నారు ఆరోజు వ్యాన్‌లో. కానీ ఒక్కళ్ళు... కనీసం ఒక్కళ్ళు కూడా "కొంచెం కష్టమైతే అయింది, ఆయన్ని మేం ఈదువుగల్లు తీసుకువెళ్ళి చూపించి వస్తాం" అనలేదు.

"ముసలోడా! నీకు కోరికలే మిట్రా!" అన్నారు. నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళిపోయారు.

ఇప్పుడు ఎంత గొప్పగా ఆయన మనసు గురించీ, కోరిక గురించీ ఉపన్యసిస్తున్నారు! ఇంత మంది కూతుళ్ళూ... కొడుకులూ... కోడళ్ళూ.. ఎవరికీ అర్థం కాలేదా ఆరోజు ఆయనపడ్డ బాధ! 'ఆయన కోరికను ఆయన బ్రతికుండగా తీర్చడం ముఖ్యం' అని ఏ ఒక్కరికీ అనిపించలేదా!

"...లేదు, నేనసలు ముందే నిర్ణయించుకున్నాను. కర్మకాండలు ఈదువుగల్లులో జరిపించాలన్న ఆలోచన నాకెప్పుడో వచ్చింది." రాఘవ మాటలు ఆమె ఆలోచనలని తెగ్గొట్టాయి.

కన్నీళ్ళలోనుంచి మసకగా కనపడుతున్న వాళ్ళందరి మొహాలూ ఆనందంతో మెరుస్తున్నాయి. తండ్రిని అర్థం చేసుకుని, ఆయన చివరి కోరికను తీరుస్తున్నామన్న ఆలోచనతో, ఆయన ఆత్మకి శాంతి కలిగిస్తున్నామన్న భావంతో వాళ్ళ హృదయాలు ఉప్పొంగుతున్నాయి.

నిజంగా తీరుతుందా ఆయన కోరిక! శాంతిస్తుందా ఆయన 'ఆ...త్మ!'

ఏమో! సమాధానం ఎవరికీ తెలీదు. కానీ ఆ ప్రశ్న మనసుని తాకిన ప్రతిసారీ వరలక్ష్మి హృదయం మాత్రం దుఃఖంతో బరువెక్కుతుంది.